క్లుప్తంగా

హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : స్థానిక దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ హుండీ సొమ్మును సోమవారం లెక్కించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ హాజరయ్యారు. జూన్ 13 నుంచి హుండీల ద్వారా మొత్తం రూ. 56,690 లభించిందని వారు తెలిపారు. అర్చకులు పిచ్చయ్యమూర్తి, శివసత్యకుమార్, సుబ్రమణ్యంతోపాటు ఆలయ మాజీ చైర్మన్ పి.పద్మాకర్, భక్తులు, సిబ్బంది సొమ్ము లెక్కింపులో పాల్గొన్నారు.

భూమి పూజ


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ సూర్యనారాయణ రావు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 25వ డివిజన్‌లో నమస్తే బోర్డు సందులో రూ.80 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, 8వ డివిజన్ ఇన్‌చార్జి ఎ. బాలక్రిష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ శివకేశవలు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కింద మంజూరైన రూ.60 లక్షలు, కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి రూ.20 లక్షలతో నమస్తే బోర్డు, కో ఆపరేటివ్ కాలనీ, ఆకుల వీధి, బీకేఎం వీధిలో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైతన్య కెమికల్స్ అధినేత రామమూర్తి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు సాహితీ సదస్సు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం ఉదయం 10.00 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న ఈ సదస్సుకు హౌసింగ్‌బోర్డు కోదండ రామాలయ ధర్మకర్త, విశ్రాంత ఇంజనీరు దేసు వెంకటరెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. తెలుగు సాహిత్యంలో శ్రీ ఒంటిమిట్ట కోదండ రామస్వామి అనే అంశంపై రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ ప్రసంగించనున్నారని వివరించారు.

అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరం పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్రంలో సోమవారం దాతలు అన్నదానం చేశారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని శ్రీ సత్యసాయి విద్యాసదన్ ప్రాథమికోన్నత పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూకల శ్రీనివాసులు, పాఠశాల చైర్మన్ డాక్టర్ సందా సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు


కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో ఆపస్ జిల్లా అధ్యక్షుడిగా శెట్టెం చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవిరెడ్డి కొండారెడ్డిని, జిల్లా గౌరవాధ్యక్షుడిగా బాలనాయుడు, కోశాధికారిగా శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులుగా నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగమునీశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, నాగలక్ష్మి, కార్యదర్శులుగా రమణయ్య, ప్రకాష్‌రెడ్డి, చంద్రమోహన్ కార్యవర్గ సభ్యులుగా జనార్ధన్, మీడియా ఇన్‌చార్జు బాలకృష్ణుడు, క్రీడా కన్వీనర్‌గా సతీష్, సాంస్కృతిక కన్వీనర్‌గా రామచంద్ర, సేవా కన్వీనర్‌గా బోగేశ్వరయ్య, డివిజనల్ కార్యదర్శిగా రామోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో ఎన్నికల పరిశీలకులుగా సత్యనారాయణ, ఎన్నికల అధికారులుగా సంజీవరెడ్డి, బాలనాయుడు వ్యవహించారు. అనంతరం పరిశీలకులు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్ చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్‌బాషలు కోరారు. సోమవారం కడప రైల్వేస్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్‌కు వారు ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ కడప రైల్వేస్టేషన్ ఆవరణలో గూడ్స్ షెడ్ ప్లాట్‌ఫాం దగ్గర జరుగుతున్న మరమ్మతులు, రోడ్డు పనులు నెమ్మదిగా కొనసాగడం వల్ల గూడ్స్ షెడ్డుకు రావాల్సిన బియ్యం, ఎరువులను కడపకు రోడ్డు మార్గాన తరలిస్తున్నారన్నారు. గూడ్స్ షెడ్డును నమ్ముకున్న హమాలీ కుటుంబాలకు ఉపాధి తగ్గిపోతోందన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు పాలయ్య, శ్రీను, చిన్న ఓబులేశు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి


స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన «స్పందన» కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 40 అర్జీలు రాగా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 14, టౌన్‌ప్లానింగ్–15, రెవెన్యూ విభాగం–4, హెల్త్ విభాగం–1, యూపీఏ విభాగం–2, కడప తహసీల్దార్–2, సీకే దిన్నె తహసీల్దార్–1, డీఈఓ–1 అర్జీ వచ్చింది. వీటిని సమగ్రంగా పరిశీలించి తగు పరిష్కారం చూపాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఎస్ఈ, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మార్నింగ్ విజిట్‌లో భాగంగా కమిషనర్ పుట్లంపల్లి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉక్కాయపల్లె, వినాయక నగర్ ప్రాంతాలను పరిశీలించారు. వినాయకనగర్, ఉక్కాయపల్లె గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జీటీఎస్ స్టేషన్ల వద్ద మొక్కలు నాటించాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. అమృత్ స్కీం కింద కట్టిన వాటర్ ట్యాంకులను ఉపయోగంలోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేయడం తగదు


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: మసీదు అంశంపై రాజకీయాలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్‌బాషా, కో ఆప్షన్ సభ్యుడు హరూన్ బాబు, కార్పొరేటర్ షఫీ అన్నారు. యాకుబ్ సాబ్ మసీదును, ప్రహరీలో ఒక్క ఇటుక కూడా తొలగించలేదని, అయినా సోషల్ మీడియాలో మొత్తం మసీదును, స్మశాన గోడను కూల్చేసినట్లు పోస్టులు పెట్టి దుష్ప్రచారం చేయడంపై సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణా సర్కిల్‌లోని యాకుబ్ సాబ్ మసీదును క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు వారాలుగా కొందరు మసీదు అంశాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. నగరంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా రహదారుల విస్తరణ చేసేందుకు 2022 మే నెలలో కొలతలు వేసి, మార్కింగ్ ఇచ్చారన్నారు. ఇటీవల మసీదు కోల్పోతున్న 12 సెంట్ల స్థలానికి నష్ట పరిహారంగా రూ.7.83కోట్లు వక్ఫ్‌బోర్డుకు ఇటీవల జమ అయ్యాయన్నారు. ఇవన్నీ మసీదు కమిటీ అంగీకారంతోనే జరిగాయన్నారు. ఆదివారం మసీదు కాంప్లెక్స్‌లోని కొన్ని ఆక్రమణలు తొలగిస్తుంటే మసీదు, ప్రహరీ తొలగిస్తున్నట్లు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. వీటికి మసీదు కమిటీనే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. నష్ట పరిహారానికి సంబంధించిన రూ.7.83కోట్లు మసీదు కమిటీ ఖాతాలో పడి ఉంటే ఎవరూ మాట్లాడేవారు కాదని ఎద్దేవా చేశారు. టీడీపీ నేత అమీర్ బాబు సోదరుడైన నిస్సార్ అహ్మద్ మసీదు కమిటీలో సభ్యుడిగా ఉన్నారని, క్రిష్ణా సర్కిల్‌లో విస్తరణలో కోల్పోతున్న తన బావ ఆస్తిని కాపాడాలని ఆయన డిప్యూటీ సీఎం, మేయర్‌ల వద్దకు పోయి కోరారే తప్పా, ఏనాడు మసీదునుగానీ, స్మశానాన్నిగానీ కాపాడాలని కోరలేద న్నారు. మసీదుకు వచ్చే చందాలు, కాంప్లెక్స్ బాడుగలు ఏమవుతున్నాయో ఎవరికీ తెలియదన్నారు. ప్రభుత్వం స్మశాన అభివృద్ధికి రూ.35లక్షలు మంజూరు చేసినా మసీదు కమిటీ వారు అభివృద్ధి పనులు చేసేందుకు అంగీకరించలేదన్నారు. ఇందు లోనే వారి స్వార్థం బయటపడుతుందన్నారు. పదేళ్ల నుంచి ఇదే కమిటీ ఉందని, దీన్ని వెంటనే రద్దు చేసి కొత్త కమిటీని నియమించాలని వక్ఫ్‌బోర్డు అధికారులను కోరుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి పునీల్, వేర్‌హౌస్ కార్పొరేషన్ ఛైర్మన్ కరిముల్లా, బీహెచ్ ఇలియాస్, బంగారు నాగయ్య, మియ్యా, షఫీవుల్లా, రెడ్డి ప్రసాద్, షంషీర్, జమాల్‌వలీ పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకం


ఉత్తమ ఉద్యోగులతో ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో అధికారుల మన్ననలు పొందేలా పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకమని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జోనల్ వర్క్‌షాప్‌లో ఉత్పాదకత సమీక్షా సమావేశాన్ని నిర్వహించి ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విలీనం చేశారని, అందుకు తగ్గట్టుగానే ఆర్టీసీని లాభాల బాటలో పయనింపజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేయడం ద్వారా జోన్ మొదటిస్థానంలో ఉందని, దీనిని అలాగే కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ బస్సులను కండీషన్‌లో ఉంచినపుడు ప్రజలకు మెరుగైన సేవలు అందించిన వారమవుతామన్నారు. అనంతరం ఈడీ.. జోనల్ వర్క్‌షాప్‌లో శ్రీనివాసులు, ఏఎస్ నాయక్, జోనల్ స్టోర్స్‌లో జయాకర్, ఎర్రిస్వామి, టైర్ రీట్రేడింగ్ షాపులో సుధాకర్, గౌస్‌పీర్‌లను ఉత్తమ ఉద్యోగులుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ జోనల్ మేనేజర్ అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

చేపల వినియోగాన్ని పెంచేందుకు కృషి

– మేయర్ సురేష్‌బాబు


మత్స్యశాఖ అధికారులతో కలిసి ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న మేయర్ సురేష్‌బాబు

కడప అగ్రికల్చర్: రాష్ట్రవ్యాప్తంగా చేపల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అందుకోసం ఫిష్ ఆంధ్ర రిటైల్ షాపులను నిర్వహిస్తోందని కడప నగర మేయర్ సురేష్‌బాబు అన్నారు. రాయలసీమ పరిధిలోని కర్నూల్‌లోని రావూరి గార్డెన్‌లో మత్స్యశాఖ, భూమి ఆర్గానిక్ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 3, 4, 5 తేదీలలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం మేయర్ సురేష్‌బాబు తన కార్యాలయంలో మత్స్యశాఖ డీడీ నాగలింగాచార్యులు, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట రమణ, మత్స్యశాఖ కడప అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగర మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ చేపల వాడకం అనేది ఆరోగ్య కరమైనదన్నారు. చేపల్లో కొవ్వుశాతం తక్కువ కాబట్టి ప్రతి ఒక్కరూ వీటిని తినొచ్చన్నారు. ఇందుకోసమే ప్రభుత్వం ప్రతి ఒక్కరికి చేపలను అందుబాటులో ఉంచేందుకు ఫిష్ ఆంధ్ర రిటైల్ షాపులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. వీటితోపాటు మత్స్యకారుల కోసం అనేక రకాల పథకాలను అమలులోకి తెచ్చిందన్నారు. మృత్స్యశాఖ డిప్యూటి డైరెక్టర్ నాగలించార్యులు మాట్లాడుతూ ఈ ఫుడ్ ఫెస్టివల్‌ల్లో మంచినీటి, సముద్ర చేపల రుచికరమైన వంటకాలతో కూడిన అపరిమితమైన భోజనం కేవలం రూ. 399 అన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అక్రమంగా నిర్మించిన గోడను తొలగించాలని కడప నగరం గంజికుంట కాలనీకి చెందిన ప్రసన్న కోరారు. వీరుగాక ఇంకా కొంతమంది రైతులు తమకు డీకేటీ పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే బోరుబావులు మంజూరు చేయాలని విన్నవించారు. డీకేటీ పట్టాలు లేకపోవడం వల్ల బ్యాంకు నుంచి పంట రుణాలు రాలేదని, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు తదితర పంటల పెట్టుబడికి అధిక వడ్డీతో అప్పులు చేసుకోవాల్సి వస్తోందన్నారు. జెడ్ హెచ్‌డీసీ భూముల విషయంలో ఎంజాయ్‌మెంట్ సర్వే చేయించి డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి కోరారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీలో నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ / కడప ఎడ్యుకేషన్: విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాద మృతులకు డీవైఎఫ్ఐ నాయకులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు కొవ్వొత్తులు చేతబట్టి నగరంలో ర్యాలీ నిర్వహించి మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రామ్మోహన్, శ్రీనివాసులు రెడ్డి, వీరనాల శివకుమార్, సీఐటీయూ జిల్లా కోశాధికారి లక్ష్మీ దేవి, జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డీఎం.ఓబులేసు, సురేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో సమాజంలో గౌరవం

– డీఈఓ రాఘవరెడ్డి


మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చదువుతో సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగర శివార్లలోని కేంద్ర కారాగారంలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియేట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ క్షణికావేశంతో చిన్నపాటి తప్పు చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. చదువుకోవాలని ఉండి వివిధ కారణాల వల్ల చదువుకోలేక పోయిన వారి కోసం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఆసక్తిగల జైలు జీవితం అనుభవిస్తున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ఐఎస్‌హెచ్ ప్రకాశ్, ఉప పర్యవేక్షణాధికారి సాంబశివరావు, రాష్ట్ర కో ఆర్డినేటర్ అక్బర్ అలీ, జిల్లా కో ఆర్డినేటర్ కేపీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతన్నకు దన్నుగా రైతు భరోసా కేంద్రాలు

– ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతన్నకు దన్నుగా నిలుస్తున్నాయని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాయసంపల్లె, వీరపునాయునిపల్లెలో 44 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైన అన్ని వనరులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకుడు నరసింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, సర్పంచు సరోజినీదేవి, ఎంపీటీసి సభ్యులు రామాంజనేయరెడ్డి, రాఘవ యాదవ్, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, స్థానిక నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డి పల్లె పంచాయతీ, కొండావాండ్లపల్లెకు చెందిన ఓ వ్యక్తికి మూడురోజుల జైలు శిక్ష విధించినట్లు సంబేపల్లె ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండావాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ఇటీవల మద్యం సేవించి వాహనం నడిపినందుకు సంబేపల్లె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా సోమవారం రాయచోటి ఏజేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్ఎంటీకే శారద వెంకటరమణకు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

'పాల్'ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు : విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాధికారి రాఘవరెడ్డి తెలిపారు. మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో సోమవారం ఆయన పాల్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాల్ ల్యాబ్ హెడ్ ఫోన్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం బోధనలో టెక్నాలజీని ఉపయోగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందని తెలిపారు. ట్యాబ్‌ల ద్వారా విద్యా బోధనలో కొత్త కొత్త అంశాలను, మెలకువలను విద్యార్థులు స్వయంగా తెలుసుకుని, నేర్చుకునే అవకాశం కల్పిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మలత, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు, ఎల్.సూర్యనారాయణరెడ్డి, మునెయ్య, ఆనందరావు పాల్గొన్నారు.

108లో ప్రసవం


ఆడబిడ్డకు జన్మనిచ్చిన వరలక్ష్మి

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీకి చెందిన బి.వరలక్ష్మి సోమవారం రాత్రి 108 వాహనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు సిద్దవటం మండలం 108 వాహనం సిబ్బంది ఈఎంటీ జి.వరలక్ష్మి, పైలెట్ కె.వి.సురేష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం ఎస్టీ కాలనీకి చెందిన బి. వరలక్ష్మి డెలివరీ కోసం సిద్దవటంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం ఉదయం చేరిందన్నారు. అక్కడ డెలివరీ కాకపోవడంతో వైద్యులు కడప రిమ్స్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. దీంతో ఆమెను 108 వాహనంలో సోమవారం రాత్రి రిమ్స్‌కు తరలిస్తుండగా కడపలోని పాలకొండ రహదారి వద్దకు రాగానే వరలక్ష్మికి నొప్పులు ఎక్కువవ్వడంతో ఈఎంటీ జి.వరలక్ష్మి ఆమెకు కాన్పు చేసిందన్నారు. దీంతో ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారని, వారిని కడప రిమ్స్‌లో చేర్పించినట్టు చెప్పారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వారు తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించనున్న తరుణంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. కడప నగరంలోని చిలకలబావి దగ్గర ఉన్న ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ కడప నగర సమితి ముఖ్యనాయకుల సమావేశం ఏఐటీయూసీ కడప నగర ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి మాట్లాడారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె: మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకుడు నరసింహారెడ్డి అన్నారు. పాయసంపల్లె, వీరపునాయునిపల్లె గ్రామాల్లో సాగు చేసిన మినుము పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పొగాకు లద్దెపురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణకు ఎపిసెట్ 1.5 గ్రాములు లేదా క్లోరోపైరిపాస్ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. వేరు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్, 3జి గుళికలు ఎకరానికి 10కేజీలు చొప్పున వాడుకోవాలని తెలిపారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు ఇంతియాజ్, రామాంజులు పాల్గొన్నారు.

నూతన నియామకం

చెన్నూరు: తొగట వీర క్షత్రియ రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షునిగా వేల్పుల సుబ్రహ్మణ్యంను నియమించారు. తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్ తనను నియమించినట్లు సుబ్రమణ్యం సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను రామనపల్లె గ్రామంలోని తొగట వీర క్షత్రియ యువకులు, గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుంకర రామచంద్రుడు , గాంగరపు వరుణ్, పల్లా రమేష్ , తప్పెట నరేంద్ర, తొగట వీర క్షత్రియ యువకులు పాల్గొన్నారు.


కూచిపూడిలో ప్రతిభ


మెమెంటో అందుకుంటున్న బుచ్చిబాబు

కమలాపురం: మండల పరిధిలోని చదిపిరాళ్లకు చెందిన దెయ్యాల బుచ్చిబాబు కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచి వైఎస్సార్ జిల్లా తరపున మొదటి స్థానంలో నిలిచాడు. ఈ నెల 29న లారెన్స్ పుట్టిన రోజును పురస్కరించుకుని హైద్రాబాద్‌లోని పొట్టిశ్రీరాములు విశ్వ విద్యాలయంలో రెండు తెలుగు రాష్ట్రాల కళాకారులకు ఆర్‌కే కళా సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకుడు రంజిత్ నిర్వహించిన పోటీల్లో ఆయన పాల్గొని ప్రతిభ కనబరిచాడు. కాగా ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా మెమెంటోను, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు.

కేసీ కెనాల్‌కు నీటి విడుదలకు మార్గం సుగమం

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చొరవ


గండి కోట నుండి మైలవరం రిజర్వాయర్‌కు విడుదలైన నీరు

వల్లూరు: కేసీ కెనాల్ కింద ఇప్పటికే పలువురు రైతులు పలు పంటలను సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి ప్రాజెక్టులలో నీటి మట్టాలు పూర్తిగా తగ్గిపోవడంతో కేసీ కెనాల్‌కు నీటి సరఫరా నిలిచి పోయింది. ఈ క్రమంలో చెన్నూరు మండలానికి చెందిన పలువురు కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిని కలిశారు. ఇప్పటికే సాగు చేసిన పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని, కనీసం నవంబర్ మాసం వరకు కేసీ కెనాల్‌కు నీరు వస్తే పంటలు గట్టెక్కుతాయని, నీటిని విడుదల చేయించి ఆదుకోవాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన విజయవాడ ఈఎన్‌సీ అధికారులతో, ఇరిగేషన్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు సమస్యను గురించి వివరించారు. కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దీంతో అధికారులు స్పందించారు. మైలవరం రిజర్వాయర్ నుండి పెన్నా నది ద్వారా నీటి విడుదల చేసి ఆదినిమ్మాయపల్లె వద్ద గల కేసీ కెనాల్ పికప్ పాయింట్ ద్వారా పొలాలకు మళ్లించాల్సి ఉండగా మైలవరం రిజర్వాయర్‌లో నీటి మట్టం చాలా తక్కువగా వుండడంతో పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో అధికారులు మొదట గండి కోట రిజర్వాయర్ నుండి మైలవరం రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడానికి చర్యలు చేపట్టారు. మైలవరం రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగగానే బుధవారం నుండి పెన్నా నదికి నీటిని విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నుండి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నుండి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి ఇప్పటికే సాగు చేసిన పంటల రక్షణకు అవకాశం కల్పించనున్నారు. ఎమ్మెల్యే చొరవతో అధికారులు స్పందించి నీటి విడుదలకు చర్యలు చేపట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముంపు గ్రామస్తులకు నివాస గృహాలు

– పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి


భూమిపూజ చేస్తున్న పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి

వేంపల్లె : చక్రాయపేట మండలంలోని తక్కల్లపల్లి గ్రామం వద్ద కాలేటి వాగు ప్రాజెక్టు కింద ముంపు గ్రామ ప్రజలకు నివాస గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. సోమవారం పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేటి వాగు ప్రాజెక్టు 0.25 టీఎంసీ ఉండగా దానిని 1.25 టీఎంసీ ఎత్తుకి పెంచే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కృష్ణా జలాలను ఎర్రబొమ్మనపల్లి, గడ్డంవారిపల్లె గ్రామాల మీదుగా కాలేటి వాగు ప్రాజెక్టుకు నింపి లక్కిరెడ్డిపల్లె రామాపురం గ్రామాల చుట్టూ ఉన్న చెరువులకు నీటిని నింపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రైతులకు ప్రతి ఎకరాకు నీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ క్రమంలో కాలేటి వాగు ప్రాజెక్టు ఎత్తు పెంచడంతో దిగువన ఉన్న తక్కల్లపల్లె గ్రామ ప్రజలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఆ గ్రామాన్ని ఖాళీ చేయించి వారికి వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ సమీపంలో ఇళ్ల స్థలాలను మంజూరు చేశామన్నారు. మొత్తం 80 కుటుంబాలకు నివాస స్థలాలను మంజూరు చేయగా వాటికి అధికారులు ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు మాధవి బాలకృష్ణ, లక్ష్మీగాయత్రి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ మునేష్, తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, హౌసింగ్ ఏఈ శుక్రమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.